# నేరస్తులు ప్రవర్తన మార్చుకోవాలి

**సిటీ కమిషనరేట్‌లో కోర్టు నిర్వహించిన సీపీ**



నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ): సిటీలో నేర ప్రవర్తన కలిగిన వాళ్లు తమ మైండ్‌సెట్‌ను మార్చుకొని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం అదనపు జిల్లా మెజిస్ట్రేట్(ఎగ్జిక్యూటివ్) హోదాలో నగర పోలీస్ కమిషనరేట్‌లో కోర్టును నిర్వహించారు. కాలపత్థార్ పోలీస్ స్టేషన్‌కు చెందిన 12 మంది వివిధ కేసుల్లోని నేరస్తులకు, బంజారాహిల్స్ ఠాణా పరిధికి చెందిన మరో ఆరుగురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో కొందరు హత్యలు, నేరాలు చేసిన వాళ్లున్నారు. వీరిపై హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో కేసులున్నాయి. ప్రశాంతతకు భంగం కల్గిస్తే కఠిన చర్యలుంటాయని ప్రశాంతతతో పాటు సత్ప్రవర్తన కల్గిన వాళ్లుగా ఉండాలన్నారు. కనీసం సంవత్సరం పాటు మంచిప్రవర్తన కల్గిన వాళ్లుగా ఉంటే అదే అలవాటు అవుతుందన్నారు. ఈ మేరకు వారికి నుంచి ష్యూరిటీతో కూడిన సెక్యూరిటీ బాండ్లను జారీ చేశారు.



**రూ. 90కోట్లతో జిల్లా కోర్టు భవన నిర్మాణం**

మల్కాజిగిరి డైట్ కళాశాల సముదాయంలో రూ. 90 కోట్లతో నిర్మించనున్న జిల్లా కోర్టు నిర్మాణానికి గురువారం మల్కాజిగిరి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి మధుసూదన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పూజ, ఫస్ట్ జూనియర్ జడ్జి అరుణ్‌తేజ్, థర్డ్ జూనియర్ సీనియర్ జడ్జి చిరాగ్ మోహతా, డైట్ కళాశాల బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాజయాదవ్, వైస్ ప్రెసిడెంట్ కిరిట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. *- నేరేడ్‌మెట్, జనవరి 4*

**టీసీసీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ రాజ్‌నారాయణ్ ఎన్నిక**



తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ (టీసీసీ) రాష్ట్ర అధ్యక్షుడిగా, తెలంగాణ రాష్ట్ర సంఘ సేవకులు, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని టీసీసీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రాజ్ నారాయణ్ ముదిరాజ్‌ను ఎన్నుకున్నారు. *-అబిడ్స్, జనవరి 4*

## సంక్రాంతికి నాలుగు ప్రత్యేక రైళ్లు

సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీని దృష్టిలో పెట్టుకుని మరో నాలుగు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు గురువారం నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 11 నుంచి 13 వరకు ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని తెలిపారు. సికింద్రాబాద్-కాకినాడ టౌన్, హైదరాబాద్-కాకినాడటౌన్ స్టేషన్ల మధ్యలో ఈ రైళ్లు నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

## ఎలక్ట్రిక్ వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి

నాంపల్లి కోర్టులు, జనవరి 4: ఎలక్ట్రిక్ వాహనాలకు మోటారు వాహనాల చట్టం1988, కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు1989 వర్తిస్తాయని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. డివిజన్ బెంచ్ సతీశ్‌శర్మ ధర్మాసనం ప్రకటించిన తీర్పు ప్రకారం ఈ-వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి అని తీర్పులో పేర్కొన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నిబంధనలు పాటించాలని సూచించింది. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని తీర్పులో ప్రకటించారు.

## ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్ - డే) మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 17వ తేదీలోగా, రూ.300 అపరాధ రుసుముతో 24వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఎంబీఏ (సీబీసీఎస్) మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 20వ తేదీలోగా, రూ.300 అపరాధ రుసుముతో 24వ తేదీ వరకు చెల్లించాలన్నారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్ - ఈవినింగ్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 24వ తేదీలోగా, రూ.300 అపరాధ రుసుముతో 30వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. 0 వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూడాలని సూచించారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 4 : ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో.. బైక్‌పై వెళ్తున్న మహిళ మృతి చెందిన ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట రంగారెడ్డినగర్‌కు చెందిన ఆడపు శైలజ (34) భర్త చనిపోగా.. ఆమె కేపీహెచ్‌బీ కాలనీ నెక్సెస్ మాల్ సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంకులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. రోజు మాదిరిగానే గురువారం తన బైక్‌పై కేపీహెచ్‌బీ కాలనీలోని ఆఫీస్‌కు వెళ్తుండగా ఉదయం 9.50 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీ మెట్రో స్టేషన్ సమీపంలో వెనకనుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టి ఆమె పైనుంచి వెళ్లింది. తీవ్ర గాయాలపాలైన శైలజను సమీపంలోని దవాఖానకు తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్టీసీ బస్సు అతివేగంగా.. నిర్లక్ష్యంగా నడిపి బైక్‌ను ఢీ కొట్టడం వల్లే శైలజ మృతి చెందినట్లు బంధువులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఓయూ లేడీస్ హాస్టల్‌లో భద్రత కరువు

**రాత్రిపూట గదితలుపులు కొడుతున్న ఆగంతకులు**

**రక్షణ కల్పించాలని విద్యార్థినుల ఆందోళన**


రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిశోధక విద్యార్థినుల హాస్టల్‌లో తమకు భద్రత ఉండడం లేదని ఆరోపిస్తూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. రాత్రి సమయంలో ఆగంతకులు దూరి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తమకు రక్షణ కల్పించాలని రోడ్డెక్కారు. తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థినులకు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు తెలిపారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా క్యాంపస్‌లో నుంచి దారిని మూసివేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాత్రి సమయాలలో హాస్టల్‌లోకి ఆగంతకులు దూరి గది తలుపులు కొడుతున్నారని అన్నారు. ఈ ఘటన మొదటిసారి జరిగింది కాదని, పలుమార్లు ఇదే విధంగా జరిగిందని తెలిపారు. రిటైర్డ్ ఆర్మీ సిబ్బందితో ఓయూకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పుకుంటున్న ఉన్నతాధికారులు ఈ ఉదంతంపై స్పందించాలని కోరారు. సీసీ కెమెరాలతో నిఘా కల్పిస్తున్నామని చెబుతున్నారని, తమకు పటిష్టమైన రక్షణ కల్పించాలని కోరారు.

## భర్త మరణిస్తే భార్యకు బీమా డబ్బులు చెల్లించాలి

నాంపల్లి కోర్టులు, జనవరి 4 (నమస్తే తెలంగాణ) : శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో జీవిత బీమా పొందిన వ్యక్తి మరణించిన అనంతరం భార్యకు రూ. 22.50 లక్షలను చెల్లించాలని జాతీయ వినియోగదారుల కమిషన్ సభ్యులు జస్టిస్ రామ్‌సూరత్ రామ్‌మౌర్య, భరత్‌కుమార్‌పాండ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం రిపోర్టు, చార్జిషీట్‌తో పాటు సంబంధిత పత్రాలను జతచేయడం జరిగిందని, ప్రమాదవశాత్తు వ్యక్తి మరణించాడని ఇతర ఆధారాలను నిరూపించే అవకాశం వ్యక్తి భార్యకు కష్టతరమన్నారు. జీవితబీమా పాలసీలో భార్య నామినిగా సంతకం ఉందని, ఆమె చేసిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోవడం జరిగిందన్నారు. భర్త మరణించిన కారణంగా పాలసీ మొత్తం డబ్బులు భార్యకు చెల్లించాలని ఆదేశించారు. గుంటూరు జిల్లాకు చెందిన చెన్న కేశవరావు 15 సంవత్సరాల పాలసీ కింద సంవత్సరానికి రూ.1.50లక్షల ప్రీమియం, ప్రమాద బీమా రూ.11.25 లక్షలు, రోడ్డుప్రమాద మరణ బీమా సౌకర్యం రూ. 22.50లక్షలుగా కంపెనీ నిర్ధారించిందని తెలిపారు.

## హత్యకేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్


ఆనంద్‌కుమార్ రే


సంజిత్ కుమార్ తివారి

బంజారాహిల్స్,జనవరి 4: మద్యం తాగుతున్నాడన్న కోపంతో యువకుడిని కర్రలతో కొట్టి చంపిన ఘటనలో నిందితులను బంజారాహిల్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన పంకజ్‌కుమార్ నెలరోజుల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని రాఘవేంద్ర కన్‌స్ట్రక్షన్స్ సంస్థ సైట్‌లో పనిచేస్తున్నాడు. బీహార్‌లోని బోజ్‌పూర్ జిల్లాకు చెందిన ఆనంద్‌కుమార్ రే, సంజిత్ కుమార్ తివారి అదే సైట్‌లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తుంటారు. కాగా పంకజ్ కుమార్ తన బంధువైన రాజేశ్ పాశ్వాన్‌తో పాటు మరి కొంతమంది స్నేహితులతో ఈనెల 1న సాయంత్రం సైట్‌లోని తమ షెడ్డులో మద్యం తాగుతున్న విషయాన్ని గమనించి అక్కడకు వచ్చిన సెక్యూరిటీ గార్డులు ఆనంద్‌కుమార్ రే, సంజిత్ తివారి మద్యం తాగుతున్న వారిని అడ్డుకోవడంతో పాటు తీవ్రంగా మందలించడంతో గొడవ జరిగింది. ఈ గొడవలో పంకజ్ కుమార్ రాయితో ఆనంద్‌కుమార్ రే మీద దాడి చేసి పారిపోయాడు. కాసేపటికి అతడు తిరిగి సైట్‌వద్దకు రాగానే సెక్యూరిటీ గార్డులు ఆనంద్‌కుమార్‌రే, సంజిత్ తివారి కలిసి అతడిని పట్టుకుని కర్రలతో కొట్టడంతో పంకజ్ కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా నిందితులు ఆనంద్ కుమార్‌రే, సంజిత్ తివారి సికింద్రాబాద్ స్టేషన్‌నుంచి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## రాచకొండలో నలుగురు సీఐలు బదిలీ

సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ): రాచకొండ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఉప్పల్, నేరేడ్‌మెట్, వనస్థలిపురం, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్లు శ్రావణ్‌కుమార్, శివకుమార్, జలంధర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ సర్వీస్‌లను మల్టీజోన్-2కు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా రాచకొండలో మరిన్ని ఇన్‌స్పెక్టర్ల బదిలీలకు సన్నాహాలు జరుగుతున్నట్లు పోలీస్ వర్గాలలో చర్చనడుస్తుంది. సైబరాబాద్‌లో ఇటీవల రెండు దఫాలుగా బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి, అదే విధంగా హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో త్వరలోనే భారీ ఎత్తున సీఐల బదిలీలకు సన్నాహాలు జరుగుతున్నాయి.

## చెన్నై ట్రేడ్ సెంటర్‌లో పార్కింగ్ పాలసీ ఉల్లంఘన

**రూ. 50వేల జరిమానా విధించిన ఈవీడీఎం**

సిటీబ్యూరో, జనవరం 4 (నమస్తే తెలంగాణ ) : వాణిజ్య సముదాయాల్లో పార్కింగ్ పాలసీ ఉల్లంఘనపై ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) విభాగం కొరడా ఝుళిపిస్తున్నది. సికింద్రాబాద్‌లోని చెన్నై ట్రేడ్ సెంటర్‌లో వెంకట సాయి సెక్యూరిటీ పార్కింగ్ పాలసీకి విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు వాహనదారులు ఈవీడీఎం విభాగానికి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఈవీడీఎం నిబంధనలు ఉల్లంఘించిన వెంకట సాయి సెక్యూరిటీకి రూ. 50వేల జరిమానా విధించారు. నగరంలో నిబంధనలు విరుద్ధంగా ముఖ్య కూడళ్లలో ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేసిన పలువురు నాయకులపై ఈవీడీఎం జరిమానా విధించింది. ప్రధానంగా కటౌట్లు ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డికి రూ.5వేలు, నవీన్‌యాదవ్‌కు రూ. 10వేలు, బీజేపీ నాయకులు లంకల దీపక్‌రెడ్డికి రూ.5వేలు జరిమానా విధించారు.

## బంగారం పట్టివేత

శంషాబాద్ రూరల్, జనవరి 4:మహిళ ప్రయాణికురాలు 526 గ్రాముల బంగారం అక్రమంగా తరలిస్తుండగా కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన మహిళ ప్రయాణికురాలు సరైన పత్రాలు లేకుండా 24 క్యారెట్లు గల మూడు బంగారు గొలుసులను తీసుకువస్తున్నట్లు గుర్తించిన అధికారులు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. బంగారం విలువ రూ. 34.02 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హిందీ ప్రచార సంస్థ సభ్యులపై ఆరోపణలు అవాస్తం

రవీంద్రభారతి,జనవరి4: హిందీ ప్రచార సభ పూర్వ ఉద్యోగుల పేరిట హైదరాబాద్ హిందీ ప్రచార సంస్థ సభ్యులపై చేసిన ఆరోపణలు అవాస్తవం అని హిందీ ప్రచార సభ హైదరాబాద్ ఉద్యోగుల సంఘం స్పష్టం చేసింది. గురువారం విలేకరుల సమావేశంలో హిందీ ప్రచార సభ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నామ్‌దేవ్ వాగ్మోడే, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి శివలింగంగౌడ్ మాట్లాడుతూ హిందీ ప్రచార సభ సంస్థ భవిష్యత్‌ను అంధకారంలోకి తీసుకెళ్లే విధంగా దురుద్దేశంతో ఆరోపణలు చేయడం తగదని, సంస్థకు పూర్తిగా నష్టం చేసే చర్యలు విడనాడాలని తెలిపారు.